ప్రజాశక్తి
శుక్రవారం 23 మే 2025 | 5 | అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి కౌలురైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

# ఖరీఫ్ సాగుకు ముందస్తు ఏర్పాట్లేవీ..?

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ముంగారు వానలు అప్పుడే మొదలయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో వర్షాలు విస్తారంగా పడుతున్నాయి. పదును అవుతుండటంతో రైతులు దుక్కులు దున్నుకునే పనుల్లో ఉన్నారు. ఇలా పదునులు అయితే విత్తనం విత్తుకునేందుకు అవకాశం ఉంది .అయితే ప్రభుత్వం వైపు నుంచి మాత్రం ముందస్తు. ఏర్పాట్లు జరగలేదు. సాధారణంగా. అయితే ఇప్పటికే. విత్తన పంపిణీ జరగాల్సింది.కానీ ప్రభుత్వం. ఇప్పటి వరకు విత్తన సేకరణ ప్రక్రియనే ప్రారంభించలేదు. ధర నిర్ణయం కూడా సోమవారం జరిగింది. ఇక సేకరణ ,పంపిణీ ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది తెలియటం లేదు. ఖరీఫ్ ప్రణాళికను అయితే వ్యవసాయ శాఖ పూర్తి చేసింది.

**ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళిక**

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 8.48 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయన్నది లక్ష్యం. ప్రధాన పంట వేరుశనగ 4.49లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా ఉంది .ఆముదం 40260 ఎకరాలు ,కంది 1.36లక్షల ఎకరాలు ,వరి 48100 ఎకరాలు, మొక్కజొన్న 36207 ఎకరాలు, పత్తి 1.08 లక్షల ఎకరాలు ఇతర పంటలన్నీ కలిపి ఈ సీజన్ లో 8.48 లక్షల ఎకరాల్లో సాగు చేయాలన్నది లక్ష్యం. ఇందుకు తగ్గట్టు విత్తన ప్రణాళికను ఏప్రిల్ మాసంలోనే.సిద్ధమైంది. అందుకోసం 54 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని అంచన వేశారు .కాని పంపిణీనే ఎప్పుడు అన్నది తెలియటం లేదు.

**మేనెలలో విస్తారంగా వర్షాలు**

జిల్లాలో మే నెలలో విస్తారంగా వర్షాలు పడ్డాయి. సాధారణ వర్షపాతం 33.1.మిల్లీమీటర్లు అయితే 137.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది.314 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది.

దుక్కి దున్నుతున్న రైతు

# నూతన కౌలురైతు చట్టం అమలు చేయాలి

## ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

**ప్రజాశక్తి - ఉరవకొండ**

నూతన కౌలు రైతు చట్టం అమలు చేయాలని, కౌలు రైతులందరికీ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు డిమాండ్ చేశారు. గురువారం ఉరవకొండ మండల కేంద్రంలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సిపిఎం స్థానిక కార్యాలయంలో ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కరిబసప్ప స్వామి గవి మఠం వద్ద నుండి ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ సర్కిల్ మీదుగా సిపిఎంకార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం కౌలురైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి అధ్యక్షతన కౌలు రైతుల సమస్యల పరిష్కారానికై నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథులుగా కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు,జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణమూర్తి, రైతు సంఘం చంద్రశేఖర్ రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పెద్ద.ముష్టూర్.వెంకటేశులు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ అన్ని గ్రామాలలో గ్రామసభ ద్వారా కౌలు రైతులను గుర్తించి అన్నదాత సుఖీభవను కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమిలేని నిరుపేదలకు దేవాదాయ భూములను సాగుకు కౌలుకు ఇచ్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. నూతన కౌలు రైతు చట్టం కచ్చితంగా అమలు చేసి ఆదుకోవాలని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాలకు ఎటువంటి షరతులు లేకుండా గ్రామ పంచనామా ఆధారంగా పది లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు వేలాది రూపాయలు ముందస్తు గుత్త చెల్లించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతూ మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం కౌలు రైతుల ఇబ్బందులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ముందస్తు కౌలు లేకుండా పంట కోతల తర్వాత చెల్లించే విధానం ప్రభుత్వమే అమలు చేయాలన్నారు. పురుగు మందులు, విత్తనాలు ప్రభుత్వమే ఉచితంగా కౌలు రైతులకు ఇవ్వాలన్నారు. తక్షణం నూతన కౌలు చట్టం చేసి కౌలు రైతులందరికీ రక్షణ కల్పించాలని,సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల అప్పులు మాఫీ చేసి బ్యాంకుల నుండి పంట రుణాలు ఇప్పించాలన్నారు. కౌలు రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మార్కెట్ సౌకర్యం గిట్టుబాటు ధర చట్టం చేసి నష్టపోకుండా కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. కౌలురైతుల సమస్యల పరిష్కారానికై జూన్ 5న రాష్ట్రంలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల ముందు అలాగే 16వ తేదీన విజయవాడ సిసిఎల్‌ఏ ఆఫీసు ముందు పెద్ద ఎత్తున ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో రాజకీయాల కతీతంగా కౌలు రైతులు వ్యవసాయ కూలీలు పేద రైతులు ఐక్యమై అసంఘటితరంగ కార్మికుల్లా పోరాడి కౌలు రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సంఘం అండగా ఉంటే ధైర్యం చైతన్యం ప్రశ్నించే గుణం పేదలందరికీ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మోపిడి గ్రామ సర్పంచి సిద్ధార్థ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరూపాక్షి, నాయకులు శీనప్ప, మురళి, రవి, సురేష్, నారాయణస్వామి, రామాంజనేయులు, తిమ్మప్ప, గంగన్నతో పాటు నియోజకవర్గంలోని కౌలు రైతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# యండియు వ్యవస్థను రద్దు చేయొద్దు

## ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి

**ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్**

ప్రజలకు నిత్యవసరాల పంపిణీలో ఇంటి వద్దకు వాహనాల (యండియు) వ్యవస్థను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈసందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి సావిత్రి, జిల్లా అధ్యక్షులు శ్యామలమ్మ, చంద్రిక మాట్లాడుతూ పాత పద్ధతి తోపాటు రేషన్ షాపుల వద్ద సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వహణలో లోపాలు సరిదిద్ది యం.డి.యు వ్యవస్థను మరింత మెరుగుపరచాలని అవినీతికి తావు లేకుండా కొత్త సాంకేతికతో అనుసంధానం చేయాలని కోరారు. యండియు వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్ద బియ్యం అందించడం ఎంతో సౌకర్యంతో ఉందన్నారు. యండియు వాహనం వచ్చే సమయానికి కూలి పనులకు వెళ్లిన పేదలకు తర్వాత రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకునేటట్లు ఏర్పాటు చేయాలే తప్ప మొత్తం వ్యవస్థనే రద్దు చేయడం ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తుందన్నారు. ఈ వాహనాల ద్వారా అక్రమ రవాణా జరుగుతుందనే నెపంతో ప్రజలకు ఇంటివద్ద బియ్యం అందించకుండా డిపోల వద్దనే తీసుకుపొమ్మనడం సరైనది కాదన్నారు. వాహనాల ద్వారా అక్రమ రవాణా జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేసినట్లయితే ప్రజలందరూ వినియోగించటం వలన అక్రమ రవాణాను కూడా అరికట్టవచ్చని సూచించారు. యండియు వ్యవస్థ రద్దు వలన వాహనాల డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. డీలరు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా రేషన్ షాపులను కిరాణా దుకాణాలుగా మారుస్తామని కేంద్రం అందించే భారత్ ఉత్పత్తులను తక్కువ ధరలకు అందిస్తామని దీనికి కేంద్రం అనుమతించిందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ షాపుల నిర్వహణపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రభుత్వం బియ్యంతో పాటు కందిపప్పు , నూనె, చింతపండు రేషన్ డిపోల ద్వారా సరఫరా చేయాలని కోరారు.

# యోగాతో ఆరోగ్యం : డిఎంహెచ్ఒ

**ప్రజాశక్తి-అనంతపురం**

యోగాతో అనేక రకాల జబ్బులు దూరం అవుతాయనియోగాంధ్ర జిల్లా నోడల్ అధికారిణి, డిఎంహెచ్ఒ ఇబి.దేవి సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వివేకానంద యోగా కేంద్రం సహకారంతో ఆర్ట్స్ కళాశాలలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో యోగా ఫర్ వన్ ఎర్త్ , వన్ హెల్త్ అన్న నినాదంతో ఈనెల 21 నుంచి జూన్ 21వతేదీ వరకూ అంతర్జాతీయ యోగ దినోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ గంటపాటు యోగా చేస్తే చాలా రోగాలు దరిచేరవన్నారు. కావున ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూష్ జిల్లా అధికారి లాల్యానాయక్, డాక్టర్ రామ్‌కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మశ్రీ, డిపిఆర్ఒ గురుస్వామి, వివేకానంద యోగా కేంద్రం యోగ ఇన్‌స్ట్రక్టర్ ఆంజనేయులు, దివాకర్, లక్ష్మీనారాయణ, డెమో త్యాగరాజ్, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్లలో సౌకర్యాలపై దృష్టి సారించండి

## ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు

**ప్రజాశక్తి-అనంతపురం**

అధికారులతో మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు

బస్టాండ్‌లలో మెరుగైన వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ కడప జోనల్ పూల నాగరాజు సూచించారు. గురువారం అనంతపురంలోని తన ఛాంబర్‌లో ఆర్టీసీ అధికారులతో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల కల్పన, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలను పరిశుభ్రంగా ఉంచటంపై దృషి సారించాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అనంతరం అనంతపురం 3వ పట్టణ ఎస్ఐ నగేష్‌తో ప్రయాణికుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అనంతపురం రీజినల్ మేనేజర్ ఆర్ ఆథోని, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిపో మేనేజర్లతోపాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎక్సైజ్ అధికారుల సెట్టింగు.. వైన్ షాప్ లోపలే సిట్టింగు...

మద్యం దుకాణంలో మద్యంప్రియులు తాగడానికి ఏర్పాటు చేసిన కుర్చీలు, బెంచీలు

## పేరుకే వైన్ షాప్.. నడిచేది బార్ అండ్ రెస్టారెంట్...

## ప్రతి బాటిల్ పై రూ.20 అ'ధనం'

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

జాతీయ రహదారి సమీపంలో వైన్ షాప్ పెట్టడమే తప్పని అధికారులు ఓపక్క చెబుతుంటే, ఏకంగా వైన్ షాప్ అండ్ సిట్టింగ్ కూడా ఏర్పాటు చేసి యథేచ్ఛగా నడిపేస్తున్నారు. కొడికొండ చెక్‌పోస్టు వద్ద ఉన్న వైన్ షాపు నిర్వాహకులు మద్యం ప్రియుల నుంచి రూ. 20 అ'ధనం'గా వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు నిత్యం అదే దారిలో వెలుతున్నా ఈ మద్యం షాపు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. వారందరి మూమూళ్లఆ అ'ధనం'లో భాగమే అన్న ప్రచారం సైతం ఊపందుకుంది.

**అధికార పార్టీ పేరు చెబుతూ దందా...**

'అమ్మో అది అధికార పార్టీ వారికి చెందిన మద్యం షాపు. దానిపై ఏ అధికారికి ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేక పోగా వారు మా పేరు కూడా ఆ నిర్వాహకులకి చెబుతారు. ఇక మా పైన వైన్ షాప్ నిర్వాహకులు తిరగబడారు. ఎమ్మార్పీ పై ఎంత అదనంగా తీసుకున్న మాట ఎత్తలేకున్నా'మని పలువురు మద్యం ప్రియులు బహిరంగంగానే చెబుతున్నారు. అదే తరహాలోనే ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు నామ మాత్రంగా కూడా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

**నిబంధనలకు పాతర..**

సాధారణంగానే కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులలో మద్యం దుకాణాలు జాతీయ రహదారులకు 500 మీటర్లు దూరంగా నిర్వహించాలన్న నిబంధన ఉంది. అయితే దీనిని మున్సిపాలిటీ, పట్టణాల పరిధిలో సడలింపు ఇచ్చినప్పటికి గ్రామీణ ప్రాంతాలలో కఠినంగా అమలు చేయాల్సుంది. అయితే ఇక్కడ శిరా జాతీయ రహదారికి సమీపంలో మద్యం దుకాణమున్నా పట్టించుకునే అధికారులు లేరు. అలాగే ఎమ్మార్పీ ధరకు మించి అమ్మకాలు జరపకూడదు అయితే ఈ నిబంధన కూడా ఇక్కడ అమలు చేయడం లేదు. కోటర్‌పై అదనంగా రూ. 10 నుండి 30 రూపాయల వరకు వసులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక సిట్టింగ్ కు అనుమతులు లేక పోయిన ఏకంగా టేబుళ్లు, కుర్చీలు వేసి దుకాణం ఎదురుగా ఒక పాస్ట్ పుడ్ బండి పెట్టుకొని మద్యందారులకి రెస్టారెంట్ తరహాలో సకల సౌకర్యాలు కల్పించడం వివాదస్పదంగా మారింది. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి చట్ట వ్యతిరేక పనులు జరుగుతుండటం అధికారులు వాటిని చూసి చూడనట్లు వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది.

**చర్యలు తీసుకుంటాం...**

నిబంధనలు ఉల్లంఘించిన మద్య దుకాణం వ్యవహారంపై ఎక్సైజ్ సిఐ లక్ష్మీదుర్గయ్య ని వివరణ కోరగా వైన్ షాప్ లోపలే సిట్టింగ్ కు ఎలాంటి అనుమతులు లేవన్నారు. తనిఖీ చేసి నిబంధలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తమ తనిఖీలో తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# ఐకమత్యంతో ముందుకెళ్దాం..

## స్థానిక సంస్థల్లో ఏకపక్ష విజయం సాధిద్దాం..-జిల్లా మహానాడులో నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం**



జిల్లా మహానాడులో పాల్గొన్న ఎంపి, ఎమ్మెల్యేలు, నాయకులు

తెలుగుదేశం పార్టీ సభ్యులు అందరం ఐకమత్యంతో ముందుకు సాగుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయాన్ని సొంతం చేసుకుందామని మంత్రి పయ్యావుల కేశవ్, పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని అనంతపురం ఎంవైఆర్ ఫంక్షన్ హాలులో తెలుగుదేశం పార్టీ జిల్లా మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిచోటా అసంతృప్తి, భేదాభిప్రాయాలు ఉన్నట్లే పార్టీలోనూ చిన్నచిన్న అభిప్రాయభేదాలు సర్వసాధారణమన్నారు. వాటిని పెద్దవి చేసుకోకుండా కలసి మెలసి పార్టీనీ సమిష్టిగా ముందుకు తీసుకెళ్లడానికి బాటలు వేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించటానికి మంత్రి లోకేష్ బాబు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారన్నారు. పెద్దపెద్ద కంపెనీలను ఆకర్షించి రాష్ట్రంలో విరివిగా పరిశ్రమల స్థాపన, అభివృద్ధికి తీవ్రంగా శ్రమిస్తున్నారన్నారు. అలాంటి వారి నాయకత్వంలో పని చేస్తున్నందుకు ప్రతి తెలుగుదేశం కార్యకర్త ఎంతో గర్విస్తున్నారన్నారు. రాష్ట్రం కోసం వారు చేస్తున్న శ్రమకు గుర్తింపుగా మనం కూడా పార్టీ బలోపేతానికి ఐకమత్యంతో ముందుకు నడవాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయభేరి మోగించాలన్నారు. రాయలసీమ జిల్లాలకు అతి ముఖ్యమైన హంద్రీనీవా ప్రాజక్టును వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులో అంతర్భాగమైన బిటిపి, పేరూరు, 36సీ ప్యాకేజీ పనులు పూర్తి చేయగలిగితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. గత వైసిపి పాలనలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వారి ఆగడాలు, అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొని పార్టీ అధికారంలోకి వచ్చేందుకు తోడ్పడిన వారి శ్రమకు తప్పక తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరామ్, బండారు శ్రావణిశ్రీ, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఉనికిని చాటుకునేందుకే జగన్ విమర్శలు

## అమరావతిపై విషం చిమ్మడం అలవాటైంది.. మంత్రి పయ్యావుల కేశవ్

**ప్రజాశక్తి-అనంతపురం**

తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే మాజీ సిఎం జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. జిల్లా మహానాడు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జగన్ తన అస్తిత్వం కాపాడుకోవడానికి ఉన్నవి.. లేనివి చెబుతున్నాడన్నారు. అమరావతిపై విషం చిమ్మడం, అభివృద్ధిని అడ్డుకోవడమే ఆయన లక్ష్యమన్నారు. జగన్ మాటలను చూస్తుంటే పరిశ్రమలు రావడం ఆయనకు ఇష్టం లేనట్లు ఉందన్నారు. మీడియా సమావేశం అంటే నాలుగు సలహాలు ఇస్తాడు అనుకున్నాం గానీ.. లిక్కర్ పాలసీ అక్రమం అనడం బాధాకరమన్నారు. ఇవాళ ఉన్నది మీ నాన్న హయాంలో ఉన్న మద్యం పాలసీనే అనే విషయాన్ని ఆయన గుర్తించుకోవాలన్నారు. అప్పుడు కనబడని స్కాం.. ఇప్పుడు కనబడుతోందా.. అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజానీకానికి ఉచితంగా ఇసుక తోలుకోమని చెప్పింది తమ ప్రభుత్వమే అన్నారు. మీ పాలనలో గ్రామ స్థాయి నుంచి తాడేపల్లి వరకు కప్పం కట్టారన్నారు. ల్యాండ్, మైన్స్, సాండ్, వైన్ అన్ని స్కాములు జరిగింది మీ హయాంలోనే అన్నారు. రివర్స్ టెండరింగ్‌తో పోలవరం ఖర్చు మూడింతలైందని విమర్శించారు. జగన్‌కు ఎక్కడో భయం కలిగి ఈ మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. 3.5 లక్షల ఎకరాలకు ఏ ఆధారం లేకుండా ఎలా ఫ్రీహోల్డ్ చేశారన్నారు. అవి ఎవరి ఆధీనంలో ఉన్నాయో చెప్పాలన్నారు. విశాఖను నాశనం చేయడంతోపాటు పరిశ్రమలను తరిమేశారన్నారు. మీరు చేసిన అప్పులకు వడ్డీ చెల్లించేందుకే అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. రాజశేఖర్‌రెడ్డి రూపాయికి ఎకరా భూమిని కట్టబెట్టారని, ఆరోజు ఆ రూపాయికి కనీసం ఇడ్లీ అయినా వస్తుందా.. అన్నారు. ఇప్పటికైనా జగన్ వాస్తవాలు తెలుసుకుని అభివృద్ధికి సలహాలు ఇవ్వాలే తప్ప లేనిపోని విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

# షాపుల వద్ద చెత్త సేకరణపై నిర్లక్ష్యం

## రూ.73,525 జరిమానా వసూలు

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

అపరాద రుసుం విధిస్తున్న అధికారులు

నగరంలోని దుకాణాల వద్ద చెత్త ను బుట్టలలో సేకరించి వాహనాలకు అందించాలన్న విజ్ఞప్తి పెడచెవిన పెట్టి షాపుల బయటవేసి ఉండటాన్ని గుర్తించి 73,525 రూపాయలు జరిమానా వసూలు చేశారు గురువారం కమీషనర్ బాలస్వామి పాత ఊర్లోని తాడిపత్రి బస్టాండ్ సర్కిల్ వద్ద షాపుల ముందు అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉండటం చెత్త బుట్టలలో కాకుండా బయట వేసి ఉండటం గుర్తించారుకమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ వ్యర్థపదార్థాలను అనగా తడి చెత్త పొడి చెత్త వేరు చేసి డస్ట్ బిన్ నందు సేకరించాలన్నారు ఇంటింటి చెత్త సేకరణకు వాహనాలు వచ్చినప్పుడు వాటికి అందించాలన్నారు అలా వేయకుండా బహిరంగ ప్రదేశాలలో వేసిన వారిపై ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య చట్టం ప్రకారం ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్స్ రూల్స్-2016 ప్రకారం అపరాథ రుసుము విధించటం జరుగుతుందన్నారు. నగరంలో నివాసముంటున్న ప్రజలు అలాగే కమర్షియల్ ఏరియాస్ లో ఉన్న షాప్ యజమానులు కూడా నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

# యండియు వాహనాలను కొనసాగించాలని డిమాండ్

**బొమ్మనహాల్ :** ఇంటింటికీ వెళ్లి రేషన్ పంపిణీ చేసే ఎండియు వాహనాలను యథావిధిగా కొనసాగించాలని యూనియన్ మండల నాయకులు అశోక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్ధాంతరంగా ఎండియు వాహనాలను రద్దు చేసి ఆపరేటర్లను తొలగించడం బాధాకరమన్నారు. గత వైసిపి ప్రభుత్వం 2027 వరకూ కొనసాగిస్తామని తమ నుంచి ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఉన్నట్టుండి తమను తొలగించడంతో జీవనోపాధి పోయిందన్నారు. తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవగిరి, ఎర్రిస్వామి, జగదీష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమలు ఏర్పాటు చేయాలి : డివైఎఫ్ఐ

డివైఎఫ్ఐ నూతన కమిటీ సభ్యులు

**ప్రజాశక్తి-గుంతకల్లు**

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు విరివిగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో డివైఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు లేకపోవడంతో విద్యావంతులైన యువత నిరుద్యోగులుగా ఉపాధి అవకాశాలు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ముఖ్యంగా రైల్వే డివిజన్ కేంద్రంగా ఉన్న పట్టణంలో ఉపాధి కల్పించే పరిశ్రమలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. స్థానికంగా మూతబడిన స్పిన్నింగ్ మిల్‌స్థానంలో ప్రత్యామ్నాయంగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలన్నారు. యువత తప్పుదోవ పట్టకుండా మత్తుకు బానిసలు కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించాలని, లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పట్టణ కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా సురేంద్రబాబు, అధ్యక్షులుగా కెవి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా శివరాం, రంగా, వంశీ, రాకేష్, సహాయ కార్యదర్శిగా కన్నయ్య, విక్రం, పరశురాం, కోశాధికారిగా శ్రీనాథ్, కమిటీ సభ్యులుగా సాగర్, జగదీష్, నవీన్, మౌనీష్, సురేష్, యుగంధర్, చరణ్, రాజు, సాంబ తదితరులను సభ్యులుగా ఎన్నుకున్నారు.

# భంభం స్వామిని దర్శించుకున్న కర్నాటక హైకోర్టు జడ్జి

భంభం స్వామి దర్గాలో కర్ణాటక హైకోర్టు జస్టిస్ బసవరాజు కుటుంబ సభ్యులు

**ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్**

పట్టణంలోని భంభం స్వామి దర్గాను కర్ణాటక హైకోర్ట్ ఆఫ్ జస్టిస్ (బెంగళూరు/ధార్వాడ) బసవరాజు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. భంభం స్వామి దర్గా పీఠాధిపతులు బషీర్, అబ్దుల్ వహాబ్ (న్యాయవాది) జస్టిస్ దంపతులకు సాదరంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భంభం స్వామి జీవిత చరిత్రకు సంబంధించిన తెలుగు, కన్నడ పుస్తకాలను పీఠాధిపతులు జస్టిస్‌కు అందజేశారు. భం భం స్వామి దర్గా విశేషతను వివరించారు. పీఠాధిపతుల్లో ఒకరైన అబ్దుల్ వహాబ్(న్యాయవాది) కుమార్తె ముస్కాన్‌కు అలీషా కలాంతో ఇటీవల వివాహమైందని, వివాహానికి హాజరు కాలేకపోయామని, నూతన వధూవరులను జస్టిస్ దంపతులు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. దర్గా ఆవరణంలోనే జస్టిస్ దంపతులు సహఫంక్తి భోజనం చేశారు. మాజీ కౌన్సిలర్ వసంత రాజులు, తిమ్మరాజు, తిప్పేస్వామి, రహంతుల్లా, భాష తదితరులు పాల్గొన్నారు.

**కర్ణాటక జస్టిస్‌ను కలిసిన జూనియర్ సివిల్ జడ్జి**

రాయదుర్గంలోని రోడ్లు, భవనాలు అతిథి గృహంలో కర్ణాటక హైకోర్టు జస్టిస్ బసవరాజు ను రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి రమ్య మర్యాద పూర్వకంగా కలిశారు.

# దళితులపై దాడులను అరికట్టాలి

విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

**ప్రజాశక్తి-గుత్తి**

దేశంలో ఇటీవల దళితులపై దాడులు పెరిగాయని వాటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని వైసీపీ నాయకులు కేఎం, రంగనాయకులు భీమలింగ, దళిత కళామండలి రాయలసీమ ఇంచార్జి గద్దల మస్తానప్ప డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం తిరుపతిలోని మోహన్ బాబు కళాశాలలో జేమ్స్ అనే విద్యార్థిపై కొందరు అగ్రవర్ణాల విద్యార్థులు రౌడీ మూకలతో కలిసి కిడ్నాప్ చేశారన్నారు. రెండు రోజులపాటు లాడ్జిలో బంధించి చిత్రహింసలకు గురి చేసి నోటిలో మూత్రం పోసారని చెప్పారు. జేమ్స్ పై దాడి చేసిన విద్యార్థులు, రౌడీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బడుగు బలహీనవర్గాలు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల పై దౌర్జన్యాలు, దాడులు అధికమయ్యాయి అన్నారు. తమిళనాడులో బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థి నూతన బుల్లెట్ బైక్ కొనుగోలు చేసి అందులో కళాశాలకు వెళుతుండగా ఉన్నత వర్గాల యువకులు అడ్డుకొని రెండు చేతులను నరికి వేశారన్నారు. ఉత్తరప్రదేశ్ లో వరుసగా బడుగు, బలహీన వర్గాలపై దాడులు జరుగుతున్న ఆ వర్గాలు చెందిన ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు దాడులను అరికట్టకపోతే తిరుగుబాటు తప్పదని వారి హెచ్చరించారు.

# వైభవంగా ఆగులూరప్ప స్వామి ఉత్సవాలు

బోనాలను తీసుకొస్తున్న భక్తులు

**ప్రజాశక్తి-శింగనమల**

మండల పరిధిలోని శోదనపల్లి గ్రామంలో వెలసిన ఆగులూరప్ప స్వామి, యల్లమ్మ అమ్మవారి రుణాల రెండు రోజుల నుంచి అంగరంగ వైభవంగా జరుగుతోంది. బుధవారం రాత్రి నాలుగు గంటల సమయం నుంచి నదిలో జల్డి కార్యక్రమం అనంతరం యల్లమ్మ స్వామిని బల్లి పిల్లలు, ఉరుములు, ఆసాదులు యల్లమ్మ కథతో దేవస్థానానికి చేరుకున్నారు. తెల్లవారుజామున 8 గంటల నుంచి నూతనంగా నిర్మించిన యల్లమ్మ దేవస్థానంలో వేద పండితుల మధ్య హోమం చేశారు. ఈ కార్యక్రమానికి 14 దేవుళ్ల గుడికట్లు వచ్చాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోవస్తు ఏర్పాటు చేశారు. రెండు రోజులపాటు భక్తులకు అన్నదానం చేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరై స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌కౌంటర్‌పై విచారణ చేపట్టాలి

**గుంతకల్లు :** మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నంబాల కేశవరావుతోపాటు మరో 27 మంది ఆదివాసులను అత్యంత కిరాతకంగా బూటకపు ఎన్‌కౌంటర్లతో హత్యలు చేయడం బాధాకరమన్నారు. ఎన్‌కౌంటర్‌పై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

**IN THE COURT OF THE PRL.SENIOR CIVIL JUDGE: ANANTHAPURAMU**
**E.A. No:178/2024 in E.P. No:124/2019 in O.S. No: 423/2015**

**Between:**
G.Siva Sankar Reddy **...Petitioner/D.Hr**
**And**
1.K.Chidambara Reddy (died) by L.Rs
2.K.Aparna W/o K.Chidambara Reddy
3.K.Nirmala D/o K.Chidambara Reddy
4.K.Vasantha W/o K.Chidambara Reddy
5.K.Sudheer Reddy S/o K.Chidambara Reddy
6.K.Sunil Reddy S/o K.Chidambara Reddy
**...Respondants/J.Dr No:1 & Proposed J.Dr's No:2 to 6**

**NOTICE TO J.Dr'S No:2 to 6**

**To,**
**R2**:K.Aparna W/o K.Chidambara Reddy
**R3**:K.Nirmala D/o K.Chidambara Reddy
**R4**:K.Vasantha W/o K.Chidambara Reddy, aged 41 years
**R5**:K.Sudheer Reddy S/o K.Chidambara Reddy aged 23 years
**R6**:K.Sunil Reddy S/o K.Chidambara Reddy aged 19 years
All are Hindus, R/o D.No:4-1355, Ganesh Nagar, Kalyanadurg Road, Ananthapuramu.

పై నెంబరు దావాలోని ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము పై కోర్టు వారు 25-06-2025వ తేది నాటికి వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల పై కేసు మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

**(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)**
**T.R.NARAPA REDDY,**
Advocate, Ananthapuram.
Cell:9440152722

## వాహనాల తనిఖీ

**ప్రజాశక్తి-పుట్లూరు**

మండల పరిధిలోని ఎస్.గూడూరు గ్రామ సమీపంలో సీఐ సత్యబాబు ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా డ్రైవింగ్ లైసెన్స్, బీమా పత్రాలు, వాహనాల రికార్డులు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించినట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

## ఎంపిడిఓ లక్ష్మీశంకర్


కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఓ లక్ష్మీశంకర్

**ప్రజాశక్తి-కుందుర్పి**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఓ లక్ష్మీశంకర్ హెచ్చరించారు. గురువారం నిజవళ్లి, మలయనూరు గ్రామల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతికూలీకీ రూ.300 వరకూ కూలి పడుతుందన్నారు. ఎండ ఎక్కువ ఉండటంతో ఉదయం, సాయంత్రం పనులు చేసుకోవాలని సూచించారు.

ప్రమాదం జరిగితే బీమా కూడా వర్తిస్తుందన్నారు. ఉపాధి సిబ్బంది అవకతవకలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ బాలకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

# బదిలీల్లో అసంబద్ధాలను తొలగించాలి

## యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీల్లో నెలకొన్న అసంబద్ధాలను యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక కార్యాలయంలో డిఇఒ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేట్-2 ప్రధానోపాధ్యాయుల అడక్వసీ ప్రకటించిన తర్వాత గ్రేట్-2 ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లను జరపాలన్నారు. అదేవిధంగా సీనియార్టీ జాబితాలోని అసంబద్ధాలను తొలగించాలని, పాఠశాల సహాయకుల ప్రమోషన్లలో అన్ని కేటగిరీలు, సబ్జెక్టులు, మేనేజర్ మేనేజ్మెంట్ల వారిగా అడక్వసీ ప్రకటించిన తర్వాత సీనియారిటీ జాబితాలోని అసంబద్ధాలను తొలగించి ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రీస్ట్రక్షర్ జరిగిన తర్వాత కేటగిరీల వారీగా మరియు మేనేజ్మెంట్ల వారీగా పాఠశాలలకు కేటాయించిన పోస్టుల వివరాలను అధికారికంగా విడుదల చేయాలన్నారు. జీవో 19 ప్రకారం ప్రాథమికోన్నత పాఠశాలల్లో నిబంధన మేరకు పాఠశాల రోల్ ప్రకారం స్టాఫ్ పాటర్న్ పాటించాలన్నారు. 2017 బదిలీల నుంచి 2023 బదిలీల వరకూ ప్రిఫరెన్షియల్, స్పౌస్ వాడుకున్న ఉపాధ్యాయుల జాబితాలు ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, జిల్లా కార్యదర్శులు ప్రమీల, సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, సీనియర్ నాయకులు నాగేంద్ర, కోటేశ్వరప్ప, వెంకటేశ్వర నాయుడు, జాకీర్ హుస్సేన్, రమేష్, రామాంజనేయులు, అనిల్, శివరుద్రప్ప, హెంద్రీ, ఓబులపతి, చితంబరరెడ్డి, వరలక్ష్మి, ప్రసన్న రాణి, సరస్వతి, సుధా, ఈశ్వరరెడ్డి, సురేంద్ర, రామాంజి, లాలెప్ప, తదితరులు పాల్గొన్నారు.

# మేయర్ ఛాంబర్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించడం బాధాకరం

## చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి

విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లోకి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యం చేసిన టిడిపి కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి డిమాండ్ చేశారు. వైసిపి నాయకులతో కలిసి గురువారం ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం అడిషనల్ ఎస్పీ రమణమూర్తిని కలిసి టిడిపి నేతలు లక్ష్మీనరసింహ, సరిపూటి శ్రీకాంత్, నారాయణస్వామి, నాగార్జున, తదితరులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వైసిపి ప్రభుత్వం కంటే రెట్టింపు సంక్షేమ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని అమలు చేయకుండా దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కూటమి పాలనలో టిడిపి నేతలు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారన్నారు. తాను ఛాంబర్‌లో లేని సమయంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటోలు ఏర్పాటు చేయడం టిడిపి నేతల దౌర్జన్యాల పరాకాష్టకు నిదర్శనమన్నారు. సిఎం ఫొటో ఆన ఛాంబర్‌లో పెట్టాలి అనుకుంటే కమిషనర్ ద్వారా ఏర్పాటు చేయాలిగానీ, దౌర్జన్యంగా అటెండర్‌ను బెదిరించి ఛాంబర్ తాళాలను లాక్కుని ఫొటోలు ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తోందో.. రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందో ప్రజలంతా గమనించాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అక్రమ కేసులు దౌర్జన్యాలు అధికమయ్యాయన్నారు. మేయర్ ఛాంబర్‌కే రక్షణ లేనప్పుడు సామాన్యులకు ఎక్కడ రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లాబేగ్, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు రిజ్వాన్, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇషాక్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతోనే వెంకటేష్ ఆత్మహత్యాయత్నం

## సోదరుడు సాకే శేఖర్

**ప్రజాశక్తి-అనంతపురం**

మనుషుల ప్రాణాలతో రాజకీయ చేయొద్దని ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసిన టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేష్ సోదరుడు సాకే శేఖర్ అన్నారు. మంగళవారం అనంతపురంలో నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమంలో వెంకటేష్ విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆయన పరిస్థితి విషమించి బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో వెంకటేష్ ఆరోగ్య పరిస్థితి విషమించిందని వస్తున్న ఊహాగానాల నేపథ్యంలో ఆయన సోదరుడు శేఖర్ ఓ వీడియోను విడుదల చేశారు. వీడియోలో ఆయన మాట్లాడుతూ వెంకటేష్ చావుబతుకుల్లో ఉన్నాడని.. ఆయన్ని ఎవరూ పట్టించుకోలేదని.. వైద్య ఖర్చులు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారనే ప్రచారాలను ఎవరూ నమ్మొద్దన్నారు. తన సోదరుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్యాయత్నం చేశాడు తప్ప ఎవరినో ఇబ్బందులకు గురి చేయాలని కాదన్నారు. ఘటన జరిగినప్పటి నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తమకు అండగా నిలిచారన్నారు. ఆసుపత్రికి ఖర్చులన్నీ భరించడంతో పాటు తమకు బెంగళూరులో తిండి, ఉండటానికి సౌకర్యాలు కల్పించారన్నారు. ఇప్పటికే రూ.2.50లక్షల వరకూ ఖర్చు చేశారన్నారు. కానీ కొందరు మాత్రం దీనికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మీరు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నడుస్తున్న పార్టీకి చెడ్డ పేరు తీసుకురావాలని ఉంటే బయటకు వెళ్లిపోవచ్చు కానీ.. ఇలాంటి చేయడం తగదన్నారు. చివరకు మనుషుల ప్రాణాలతో కూడా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాకు అన్ని విధాలుగా అండగా ఉన్నారని.. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేమన్నారు.

# పామిడి ప్రభుత్వాసుపత్రి తనిఖీ

పామిడి ప్రభుత్వాసుపత్రిలో రోగిని వివరాలను అడిగి తెలుసుకుంటున్న డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్

**ప్రజాశక్తి-పామిడి**

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆరోగ్య కేంద్రంలోని ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, పరీక్ష గది, ఎక్స్‌రే, ఈసీజీ గదులను పరిశీలించారు. తర్వాత అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేసిన ప్రకారం వైద్యులు, సిబ్బంది ఉన్నారా..? లేదా..? అని తనిఖీ చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో వైద్యసేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. రోగుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఆస్పత్రిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో 108 అంబులెన్స్ సర్వీసెస్ లేదా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ అంబులెన్స్ మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించామని తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రోగులు అధికంగా వస్తున్నందున ఆసుపత్రి 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. రోగులకు భోజన సదుపాయాన్ని కల్పించేందుకు ఆసక్తి గలవారు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివకార్తీక్‌రెడ్డి, కమలాధర్, హెడ్‌నర్స్ శివకుమారి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చిలకల రాజగోపాల్, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రేపు గూగూడులో తలనీలాల వేలం

**నార్పల :** మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి దేవస్థానంలో ఈనెల 24న భక్తులు సమర్పించే తలనీలాల పోగుకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకేతపురం శోభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న వేలంపాట నిర్వహించాల్సి ఉండగా పాటదారులు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. దీంతో తిరిగి 24న వేలంపాట ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.5లక్షల డిపాజిట్ చెల్లించి చెల్లించాలన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**ప్రజాశక్తి-ఉరవకొండ**

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హోతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఎం.పద్మ, సర్పంచు మల్లెలు జగదీష్ సూచించారు. గురువారం వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల గ్రామంలో గడేహోతురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.పద్మ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా వైద్య సిబ్బంది గ్రామాలలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. దోమకాటు బారిన పడకుండా దోమతెరలు వాడాలని వేపాకు వేసుకోవాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రానైట్ వితరణ

**గుత్తి :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు గుత్తికి చెందిన ఎం.రామాంజనేయులు గ్రానైట్ బండలను విరాళంగా ఇచ్చారు. కంబదూరు మండలం మేళ్లకుంట గ్రామంలో బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండడంతో గ్రానైట్ బండల వ్యాపారి ఎం.రామాంజనేయులు రెండున్నర సదరాల గ్రానైట్ బండలను నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మిద్దె ఓబులేసు, నారాయణస్వామి, రామాంజనేయులు, అశోక్, రమేష్, రంగస్వామి, ఓబులేసు, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే సునీత

మహిళలతో ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు :** కార్యకర్తల సంక్షేమమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలో మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందన్నారు. అనంతరం పలు విషయాలపై చర్చించి తీర్మానాలు చేసి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండలాల కన్వీనర్లు, సర్పంచులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు

**గుత్తి :** పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గుత్తిలో రైల్వే భద్రతా దళం ఆధ్వర్యంలో రైల్వే భద్రతా దళం అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఎల్.శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ యూసఫ్, సూర్యనారాయణ, కానిస్టేబుల్ భవాని, తదితరులు పాల్గొన్నారు.

## దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి అమానుషం

**నార్పల :** తిరుపతిలో ఇంజినీరింగ్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి అమానుషమని వైసిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సాకే రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారిపోయి దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రోజూ రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట దళితులపైన దాడులు జరుగుతుండటమే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా జేమ్స్‌పై దాడి ఘటనలో పోలీసు యంత్రాంగం వైఫల్యమే కాదు, రాజకీయ జోక్యంతో కనీసం ఫిర్యాదును కూడా స్వీకరించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే హోంశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న వంగలపూడి అనిత స్పందించి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మాజీ సర్పంచికు ఎమ్మెల్యే పరామర్శ

**శింగనమల :** మండల పరిధిలోని శోదనపల్లి మాజీ సర్పంచి అట్టే రామాంజనేయులును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం పరామర్శించారు. గత నెలరోజుల క్రితం మండల కేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు గాయపడిన విషయం తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ఇంటికి వచ్చిన ఆయన్ను ఎమ్మెల్యే పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, చితంబరిదొర, చిదానందనాయుడు, మారుతీనాయుడు, గుర్రం లక్ష్మీనారాయణ, జి.సత్యనారాయణ, అనిల్‌కుమార్, కాయల రమణయాదవ్, అట్టే శ్రీనివాసులు, అట్టే చిన్న చౌడప్ప, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు అరికడదాం

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సమన్వయకర్త విజయభారతి

**కుందుర్పి :** గ్రామీణ ప్రాంతాల్లో బాలవివాహాలు అరికట్టడమే లక్ష్యమని జిల్లా సమన్వయకర్త విజయభారతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కుందుర్పి మెయిన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తెలిసీ, తెలియని వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల అనేక అనార్థాలకు దారి తీస్తుందన్నారు. ముఖ్యంగా చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల మాతా, శిశు మరణాలు సంభవించే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. మాతా, శిశు మరణాలు తగ్గించడానికి ప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు చేపడుతోందన్నారు. ఆడపిల్లలు దేశానికి పట్టుకొమ్మలాంటి వారని, వారిని చదివించి మంచి భవిష్యత్తు ఇద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సోమేశ్‌కుమార్, సిహెచ్ఓ ముంతాజ్ బేగం, ఎంపిహెచ్ఇఓ ధర్మసింగ్, పిహెచ్ఎన్ శశికళ, సూపర్‌వైజర్లు రాణి, మంజుల, పద్మజ, ఎఎన్ఎం సుధాలక్ష్మి, మహిళా పోలీస్ సౌభాగ్య, హెల్త్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతిచెందిన వెంకటేశ్వర్లు

**గుత్తి :** మండలంలోని వన్నెదొడ్డి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రాచర్ల గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వర్లు (44) ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## హత్యకేసులో నిందితుల అరెస్టు

నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు

**రాయదుర్గం రూరల్ :** రాయదుర్గం-కణేకల్ ప్రధాన రహదారిలోని కొంతానపల్లి గేట్ సమీపంలో ఈనెల 17న వినోద్‌కుమార్‌ను హత్య చేసిన అదే గ్రామానికి చెందిన నిందితులు రమేష్, బొమ్మలింగను చదం గేట్ సమీపంలో అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవిబాబు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మృతుడు నిందితుల కుటుంబ సభ్యులైన మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, గ్రామంలో చెడుగా చెప్పుకుంటూ అవమానపరుస్తూ ఉండడంతో నిందితులు కక్ష పెంచుకున్నారన్నారు. ఈనేపథ్యంలో వినోద్‌కుమార్‌ను చంపాలని నిర్ణయించుకుని గొంతుకు తాడు బిగించి ఆపై గొడ్డలితో ఇష్టానుసారంగా నరికినట్లు నిందితులు ఒప్పుకున్నారన్నారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఒక కొడవలి, నైలాన్ తాడు, మోటార్ సైకిల్ ను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐ జయనాయక్, ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది భాస్కర్, సూరి, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీరు తాగి గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

**కళ్యాణదుర్గం రూరల్ :** కంబదూరు మండలం కదిరిదేవరపల్లి జి.బొమ్మలింగప్పకు చెందిన ఏడు గొర్రెలు డ్రిప్పు మందు తాగి మృతిచెందాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గొర్రెలను మేపునకు తీసుకెళ్లగా ఓ తోటలో డ్రిప్పులకు వదిలిన మందు నీటిని తాగాయన్నారు. దీంతో ఏడుగొర్రెలు మృతిచెందాయన్నారు. తద్వారా రూ.90వేల వరకూ నష్టం సంభవించిందని బాధితుడు వాపోయాడు.